

డిప్యూటీ కలెక్టర్‌గా ఆయేషా



మదనపల్లె అర్బన్ : ఎపిపిఎస్‌సి గురువారం వెలువరించిన గ్రూప్-1 నియామకాల తుది ఫలితాల్లో అన్నమయ్య జిల్లా, మదనపల్లి పట్టణానికి చెందిన షేక్ అహ్మద్, షేక్ గౌసియాల ఏకైక కుమార్తె ఆయేషా డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమాత పాఠశాలలో పదవ తరగతి, తిరుపతి ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్మీడియట్, తమిళనాడులోని తంజావూరులో ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేశానన్నారు. తనకు గ్రూప్స్ పట్ల ఎంతో ఆసక్తి ఉండేదని, దీంతో ఇంజినీరింగ్ చదివేటప్పటి నుంచే గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్నానన్నారు. 2019లో తొలి ప్రయత్నంలో గ్రూప్-1లో ఇంటర్వ్యూ దాకా వెళ్లాలని చెప్పారు. రెండో ప్రయత్నంలో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించి లక్ష్యాన్ని అధిగమించామని పేర్కొన్నారు. తన విజయం వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ,అధ్యాపకుల సూచనలు, స్నేహితుల సహకారం ఎంతో ఉందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు ఆయేషాకు శుభాకాంక్షలు తెలిపి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత ఉద్యోగాలు అలంకరించాలని ఆకాంక్షించారు.

పేదల భూములపై పెద్దల కన్ను

- 28 ఏళ్ల సాగుకు మోకాలడ్డు
- హద్దు రాళ్లను ధ్వంసం చేసిన వైనం
- సాగు భూమిలో బాధితుల నిరసన
- డిఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన భూములపై పెద్దల కన్ను పడింది. 28 ఏళ్ల కిందట ప్రభుత్వం నుంచి పట్టాలు పొందినా ఇప్పటికీ వారికి కేటాయించిన భూముల్లో సాగు చేసుకునేందుకు అవకాశం లేకపోవడం, తమకు న్యాయం చేయాలని బాధితులు అధికారుల చుట్టూ తిరగడం ఒక ఎత్తయితే.. ఆ భూములను సైతం ఆక్రమించేందుకు కొందరు యత్నించడం మరో ఎత్తు. దీంతో బాధితులు తమకు కేటాయించిన భూముల్లోనే నిరసన తెలియజేసి న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. వివరాలు...



ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

మండల పరిధిలోని ఊటుకూరు, కొండ్లోపల్లి సమీపంలో 1995లో 1362 సర్వే నెంబర్‌లో ఒక్కొక్కరికి 60 సెంట్లు చొప్పున 67 మందికి ప్రభుత్వం పట్టాలు అందజేసింది. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూములు తనవేనంటూ కోర్టుకు వెళ్లాడు. హై కోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చి యథావిధిగా ఆ భూమిని కొనసాగించుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు లబ్ధిదారులకు ఆదేశాలు జారీ చేసింది. తమకు కేటాయించిన భూములలో సాగు కోసం పనులు ప్రారం భించిన ప్రతిసారి ఎవరొకరు వచ్చి అడ్డుపడుతున్నారని బాధితులు వాపో తున్నారు. ప్రభుత్వం తమకు మంజూరు చేసిన భూములలో సాగు చేసుకునేందుకు అనుమతి నివ్వాలంటూ పలుమార్లు తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాలు చుట్టూ తిరిగి వినతి పత్రాలు అందజేశామని పేర్కొన్నారు. చివరకు కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించామని, అయినప్పటికీ తమకు న్యాయం జరగలేదని వాపోయారు. గ్రామంలో పెద్దలుగా చలామణి అవుతున్న కొందరు తమ భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొందరు లబ్ధిదారుల వద్ద బెదిరింపులకు పాల్పడి చౌకగా భూములు లాగేసుకున్నారని, మిగిలిన భూములు కూడా ఆక్రమించుకునేందుకు దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆరోపించారు. ఇటీవల తమ భూముల్లో బోరు వేసుకొని మామిడి పంట సాగు చేస్తున్నామని, ఊటుకూరు గ్రామానికి చెందిన గణేష్ రాజు, సతీష్ రాజు, లక్ష్మీకర్‌రెడ్డి, బాల అనేవారు గురువారం రాత్రి జెసిబి, డోజర్లతో తమ పొలాల్లోకి అక్రమంగా ప్రవేశించి హద్దు రాళ్లనుసైతం ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయంపై బాధిత రైతులు శుక్రవారం తమ పొలాలు వద్ద కూర్చుని నిరసన తెలిపారు. అధికారులు ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం డిఎస్‌పి చైతన్యకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పల్లపు సుబ్బరాయుడు, రామయ్య, బట్టల కృష్ణయ్య, వెంకటయ్య, నంద్యాల జయరామయ్య, బలరామయ్య పాల్గొన్నారు.



ధ్వంసమైన హద్దురాళ్లు

రాజకీయ పార్టీలు సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలని కలెక్టర్ గిరిషా పిఎస్ రాజకీయ పార్టీలను కోరారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఓటర్ల జాబితా తయారీ, ఇంటింటికి వెళ్లి ఓటర్ల ధ్రువీకరణ తదితర అంశాల మీద వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నీ బిఎల్ఎలు, మండల, నియోజకవర్గ ఇన్‌ఛార్జుల వివరాలు సమర్పించాలని గత సమావేశంలో కోరామని చెప్పారు. చాలా పార్టీలు ఇచ్చాయని, ఇంకా ఇవ్వని పార్టీలు వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడంలో భాగంగా ప్రతి నియోజకవర్గాల వారీగా అక్కడి రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశం మినిట్స్‌ను జిల్లాలోని రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందరికీ ఇచ్చామని చెప్పారు. ఒకసారి పరిశీలించి ఇంకా ఏమైనా సూచనలు, సలహాలు ఉంటే ఇవ్వాలని కలెక్టర్ కోరారు. ఇంటింటి సర్వేలో అందరూ భాగస్వామ్యమైనప్పుడే మనం తప్పులు లేకుండా ఎన్నికల ఓటర్ల జాబితాను తయారు చేయగలమని రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఓటర్లను చేర్చడం, తీసివేయడం, సరి చేయడం వంటి వాటికి సంబంధించి వివిధ ఫార్మాట్ల దరఖాస్తులను ఓటర్ల నుంచి తీసుకున్నామని తెలిపారు. వీటిల్లో ఏమైనా సమస్యలుంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇంటింటికి పరిశీలన నిమిత్తం వెళ్ళినప్పుడు ఆ ఇంట్లోనే ఓటర్ జాబితాలో వారు కాకుండా కొత్తవారుంటే వారి నుంచి ఫారం 8 తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పోలింగ్ బూత్‌ల హేతుబద్ధీకరణకు సంబంధించి మాట్లాడుతూ సెప్టెంబర్ 29 వరకు సమయం ఉందని గడువు ముగిసే దానికి ఒక వారం ముందు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజకీయ పార్టీలకు ఇందుకు సంబంధించి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కొత్తగా ఓటర్ ఐడి కోసం దరఖాస్తు చేస్తున్న వారి గురించి మాట్లాడుతూ చాలామంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారని అలా చేసేటప్పుడు ఫొటో, చిరు నామాలలో చాలా తప్పులుంటున్నాయని, వాటిని సరి చేసేలా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా ఫామ్-7లో చనిపోయిన ఓటర్లు దాదాపు 8600 వచ్చాయని వాటిని మరలా ఒకసారి సూపర్ చెక్ చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. అలాగే ఫామ్ -7ను మార్గదర్శకాల మేరకు తీసుకోవాలని తహశీల్దార్లను ఆదేశించారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి అందిన డూప్లికేట్ ఓటర్ల వివరాలను ఈ నెల 30 లోగా విచారణ చేసి తుది జాబితా అందించాలని ఆర్డీవోలు, తహశీల్దార్లకు సూచించారు. రాయచోటి, మదనపల్లి, రాజంపేట, కోడూరు మున్సిపాలిటీల పరిధిలో బిఎల్‌ఒలతో సమీక్ష చేసి కమిషన్ నిర్దేశించిన మేరకు ఫామ్-8 లో వివరాలు పొందాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ ఓటరు జాబితా ఇంటింటి సర్వేపై ఫామ్ - 6 నుంచి ఫామ్ -11బి వరకు మండల వారీగా అబ్‌స్ట్రాక్స్ ఇవ్వాలని కోరారు. మున్సిపాలిటీలలో ఇంటింటి ఓటర్ పరిశీలన అనుకున్న స్థాయిలో జరగడం లేదని, కొన్ని పోలింగ్ స్టేషన్లో మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయని, మృతులు డూప్లికేట్ ఓటర్లను పక్కాగా సర్వే చేయాలని కోరారు. ఎన్నికల విధులలో వాలంటీర్లు పాల్గొనకుండా కట్టడి చేయాలన్నారు. జిల్లా కేంద్రం రాయచోటిలో ఇవిఎంలు భద్రపరిచిన గోడౌన్ చుట్టూ సిసి కెమెరాలు, పటిష్టమైన భద్రత కల్పించాలని కలెక్టరుకు విన్నవించారు. ఎన్నికల జాబితా తయారీలో ఎక్కడైనా వాలంటీర్లను ఉపయోగించుకున్నట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని, ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలియజేశారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు అందించిన సలహాలు, సూచనలు కూడా పరిగణలోకి తీసుకొని తప్పులు లేని ఓటర్ జాబితా రూపకల్పనకు కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి, సంబంధిత తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

రూ.21.60 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఎంపీ లాడ్స్, డిఎంఎఫ్ నిధులు రూ.21.60 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రాధాన్యతనిచ్చి వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ గిరీష పి.ఎస్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మినీ విసి హాలులో ఎంపీ ల్యాడ్స్, డిఎంఎఫ్ నిధులతో జిల్లాలో చేపట్టిన పనుల పురోగతిపై సిపిఒ, మైనింగ్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపీ లాడ్స్, డిఎంఎఫ్ నిధులతో 417 వివిధ అభివృద్ధి పనులను రూ.21.60 కోట్ల అంచనాతో చేపట్టారు. ఇందులో ఎంపీ లాడ్స్ నిధులు రూ.12.02 కోట్లతో 302 పనులను చేపట్టగా ఇప్పటివరకు రూ.3.52 కోట్లు ఖర్చు చేసి 100 పనులను పూర్తి చేశారన్నారు. డిఎంఎఫ్ నిధులు రూ.9.58 కోట్ల అంచనాతో 115 పనులు చేపట్టగా రూ. 2.69 కోట్లు ఖర్చు చేసి 32 పనులు పూర్తి చేశారని, 79 పనులకు పరిపాలన పరమైన అనుమతులు మంజూరు కాగా మిగిలిన వాటికి అనుమతులు పొందాల్సి ఉందన్నారు. ఆయా నిధులతో ప్రణాళిక ప్రకారం ప్రాధాన్యత పనులను చేపట్టారు. సదరు పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి ఇప్పటివరకు ఎన్ని బిల్లులు అప్‌లోడ్ చేశారు, ఇంకెన్ని చేయాలో అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. పూర్తయిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడూ బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. పూర్తి చేసిన పనుల బిల్లులను ఒక వారంలోగా సమర్పించాలన్నారు. పనుల పూర్తిలో నాణ్యతలో ఎక్కడా రాజీపడరాదని, ఎక్కడైనా సమస్యలుంటే ఉన్నత స్థాయి దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. లక్ష్యం మేరకు పనులను పూర్తి చేయడంలో చిత్తశద్ధితో కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో సిపిఒ కృష్ణానాయక్, ప్లానింగ్ శాఖ ఏడీ వెంకట్, జిల్లా మైనింగ్ అధికారి రవిప్రసాద్, ఆర్డబ్ల్యు ఎస్ఇ ప్రసన్న కుమార్, జిల్లా ట్రెజరీ అధికారి మహబూబ్, ఇంజినీరింగ్ శాఖల ఈఈలు, జేఈలు పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవనాలు పూర్తి కావాలి

ఈనెల చివరిలోగా ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పూర్తి కావాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రాధాన్యత భవనాల పురోగతిపై పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత భవనాలకు సంబంధించిన నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలు, భవన నిర్మాణాలను చేపడుతోందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. వచ్చేవారం నాటికి 18 బిల్డింగులు పూర్తి కావాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని కచ్చితంగా అధిగమించాలన్నారు. భవనాల నిర్మాణంలో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. ఇప్పటివరకు భవనాల నిర్మాణంలో పురోగతి తక్కువగా ఉందని, పూర్తయ్యే దశలో ఉన్న నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని చెబుతున్నా బేఖాతరు చేయడం సరికాదన్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయడం లేదని, సంబంధిత అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి భవన నిర్మాణాలను ఎప్పటికప్పుడూ తనిఖీ చేయాలన్నారు. గత నెలలో కేటాయించిన లక్ష్యాలను ఇంకా పూర్తి చేయలేదన్నారు. నిధులకు ఎలాంటి కొరత లేదని తెలిపారు. జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేలా భవనాల నిర్మాణంలో పురోగతి చూపించి నిర్దేశిత సమయంలోగా అన్ని భవన నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. సీరియస్‌గా పని చేయకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ ఇఇ రామచంద్రనాయక్, డిఇలు, ఎఇలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంజం సుకుమార్‌రెడ్డి

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో చిరుధాన్యాల ఉత్పత్తి, విస్తీర్ణం గణనీయంగా పెంచి, వీటి సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, వర్షాభావ పరిస్థితుల్లో ఇస్తున్నటువంటి ప్రత్యామ్నాయ విత్తనాలలో చిరుధాన్యాలకు ప్రాధాన్యత కల్పించి సాగును పెంచాలని అధికారులకు సూచించారు. విత్తనాలు, పురుగుమందులు సకాలంలో రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సలహా మండలి సమావేశంలో లేవనెత్తిన సమస్యలన్నీ అధికారులు నోట్ చేసుకొని ఎప్పటికప్పుడూ సంప్రదిస్తూ రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందివ్వాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అవసరమైన అన్నిరకాల నాణ్యమైన ఎరువులు, విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి బి. చంద్ర నాయక్ మాట్లాడుతూ జిల్లాలో వేరుశనగ అక్కడక్కడ వాడుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండి 2 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారి చేసుకున్నట్లయితే కొన్ని రోజుల వరకు పంట వాడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. జిల్లాలో కౌలుదారు పత్రాలు గణనీయంగా ఇచ్చారని, వీరందరికీ బ్యాంకుల ద్వారా నుంచి ఇప్పించే విధంగా అధికారులు కృషి చేయాలని, వీటికి బ్యాంకు వారు కూడా సహకరించాలని ఎల్‌డిఎంను జిల్లా వ్యవసాయ అధికారి కోరారు. అందులో భాగంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహాలు సభ్యులు భోదేశావళి, జిల్లా స్థాయి అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు

అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - పీలేరు

పీలేరులోని కోటపల్లి గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో చదు వుకుంటున్న నుంచి ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన విషయం తెలిసిందే. తిరు పతి జిల్లా పిచ్చాటూరుకు చెందిన శాంతమ్మ కుమార్తె ఎస్. యామిని, మహేష్ కుమార్తె ఎస్. లల్లి పీలేరులోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ శుక్రవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ట్రాక్ సూట్ ధరించి వసతి గృహం నుంచి బయటకు వెళ్లారు. ఈనేపథ్యంలో అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాలికలిద్దరూ వసతి గృహానికి సమీపంలో పార్కు వద్ద ఉన్న వారి అమ్మమ్మ ఇంటికి వెళ్లారని కనుగొన్నారు. వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి పాఠశాలలో అప్పగించారు.



చిన్నారులను అప్పగిస్తున్న సిఐ



విభిన్న ప్రతిభావంతుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

విభిన్న ప్రతిభావంతుల

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అలింకో కాన్పూర్ కంపెనీవారు వికలాంగుల ప్రత్యేక అవసరాలకు కోసం అవసరమైన పరికరాలను అందించేందుకు నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల నుంచి దరఖాస్తుల స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వికలాంగుల సంక్షేమ శాఖ ఏ.డి ఆర్.వి కృష్ణ కిషోర్, కాన్పూర్ అలింకో కంపెనీ కో-ఆర్డినేటర్ సునీతతో మాట్లాడి సదస్సుకు హాజరైన విభిన్న ప్రతిభావంతులందరి నుంచి దరఖాస్తులు స్వీకరించి చిన్నచిన్న పొరపాట్లు ఉన్నప్పటికీ వాటిని పక్కన పెట్టి వారి ప్రత్యేక అవసరాల కోసం ఏ పరికరాలు అయితే వారికి అవసరమో వాటిని వారికి అందించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమానికి రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి విచ్చేసిన విభిన్న ప్రతిభావంతులకు ఎమ్మెల్యే తాగునీరు, భోజన వసతిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వడ్డే రమణ, హస్తవరం ఉమామహేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ బాబు, సత్యాల రామకృష్ణ, మురళి ఆచారి, మిరియాల సురేఖ, రాజేష్ ఆచారి, శ్రీరాములు, వడ్డే శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే సిఎం జగన్ లక్ష్యం

రాష్ట్రాభివృద్ధే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున రెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి తెలియజేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా తొగురుపేటలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల కోసం భూమి పూజ చేశారు. ముందుగా గ్రామంలోని దాసాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, శాస్త్రోక్తంగా పండితుల మధ్యన భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారి ఇరువురు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డి, గృహ నిర్మాణశాఖ ఇఇ కుప్పుస్వామి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

మదనపల్లె అర్బన్ : ఎపి గ్రామీణ రహదారుల అభివృద్ధి పథకం ద్వారా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కృషితో మండలంలోని అన్ని గ్రామాల రహదారుల నిర్మాణానికి సుమారు రూ. 40 కోట్ల నిధులు మంజూరు చేయించారని జడ్‌పిటిసి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. అందుభాగంగా మాలేపాడు పంచాయతీ ఆవులపల్లెలో చేపడుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులన్నీ తర్వలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెస్తామని చెప్పారు. మండలాభివృద్ధి కోసం మంత్రి, ఎంపీ , ఎమ్మెల్యే నవాజ్‌బాషా కృషి చేస్తున్నారని, వారికి మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిజేస్తున్నారని పేర్కొన్నారు.

22లోపు పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అందించే పురస్కారాలకు ఆసక్తి కలవారు ఈ నెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని మదనపల్లె ప్రజా చైతన్య స్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ డాక్టర్లు, నర్సులు, సమాజ సేవకులకు, టీచర్లకు మదర్ థెరిసా మెమోరియల్ పురస్కారం, లాయర్లకు పోలీసులకు, జడ్జిలకు కలెక్టర్లకు, రాజకీయ నేతలకు సర్దార్ వల్లభాయ్ జీవన సాఫల్ పురస్కారం, నాటక రంగం కళాకారులకు ఎస్ వి రంగారావు జీవన సాఫల్య పురస్కారం రచయితలకు, దర్శకులకు, నిర్మాతలకు దాసరి నారాయణరావు పురస్కారం అందజేస్తారని చెప్పారు. సంగీతం, శాస్త్రీయ నృత్యం, కళాతపస్వి విశ్వనాథ్ జీవన సాఫల్య పురస్కారం, గాయకులు ఎస్.పి.బాలసుబ్రమణ్యం శ్రీలతా మంగేష్కర్ ఎక్సలెంట్ అవార్డు, నృత్యకళ చైతన్య మాస్టర్ రాకేష్ మాస్టర్ జీవన సాఫల్య పురస్కారం ,కవులకు సినారి జీవన సాఫల్య పురస్కారం, సాహిత్య కళాకారులకు శ్రీశ్రీ జీవన సాఫల్య పురస్కారం, జానపద కళాకారులకు సాయిచంద్ పురస్కారం అందజేస్తారని తెలిపారు. ఆసక్తిగలవారు 22లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9705313061, 9985303040లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'ఉక్కు' సాధనకు పోరాటమే మార్గం

-మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉక్కు పరిశ్రమ సాధనకు యువతకు పోరాటమే ఏకైక మార్గమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్‌లో డిఐఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కడప ఉక్కు సాధనకై 'రాష్ట్రస్థాయి సదస్సు' జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సదస్సుకు రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్, పశ్చిమ రాయలసీమ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, కడప ఉక్కు సాధనా కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కావాల్సిన ఇనుప ఖనిజం, సున్నపురాయి, నిఖేల్, డోలమైట్ తదితర మూలకాలు విస్తృతంగా దొరుకుతున్నాయన్నారు. విద్యుత్తు ఆర్టీపీపీ నుంచి, నీరు మైలవరం, గండికోట, బ్రహ్మ సాగర్ నుంచి, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, ముద్దనూరు రైలు మార్గం ద్వారా, కృష్ణపట్నం నుంచి ఓడ మార్గం రవాణా సౌకర్యం ఉందని తెలిపారు. 2010లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జిల్లాలో బ్రాహ్మిణి స్టీల్ కు శంకుస్థాపన చేసి, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని తలపెట్టారన్నారు. ఆయన మర ణించడం, రాష్ట్రం విభజన జరగడం, ప్రభు త్వాలు మారడంతో బ్రాహ్మిణి స్టీల్ రూ.1050 కోట్లు ఖర్చుపెట్టి తరువాత చేతులెత్తేశారని పేర్కొన్నారు. 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా విభజన చట్టంలోని 13వ షెడ్యూల్లో కడప ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వ ఉక్కు పరిశ్రమల నిర్మాణ సంస్థ సెయిల్ ఆధ్వర్యంలో నిర్మిస్తామని పార్లమెంటు సాక్షిగా, రాష్ట్రపతి ఆమోదంతో రాతపూర్వకంగా చట్టంలో పొందుపరిచారన్నారు. అప్పట్లో పాలక, ప్రతిపక్షాలు ఆమోదం తెలిపాయని పేర్కొన్నారు. కరువు తీవ్రంగా ఉన్న ప్రాంతం రాయలసీమలో ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమ ఒకటీ లేదని, ఈ ప్రాంత అభివృద్ధికి కడప ఉక్కు పరిశ్రమ ప్రాణ వాయువు లాంటిదని చెప్పారు. బిజెపి రాష్ట్ర నాయ కులు కర్నూల్‌లో రాయలసీమ డిక్లరేషన్ పేరిట కడప ఉక్కు నిర్మిస్తామని ప్రకటించారని, అదే బిజెపి పెద్దలు ఢిల్లీలో పార్లమెంటులో కడప ఉక్కు సాధ్యం కాదని మోసం చేశారన్నారు. సెయిల్ చైర్మన్ కడప జిల్లాకు వచ్చి 'పబ్లిక్ హియరింగ్' నిర్వహించాలని అప్పుడే నిజాలు వెల్లడవుతాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లూస్ థింకింగ్ చేస్తున్నాయని వాపోయారు. బిజెపి ఆంధ్ర రాష్ట్రంలో రాజకీయ ప్రయోజనాలు లేవని తప్పుడు రిపోర్ట్ తెప్పించుకుని కడప ఉక్కు నిర్మించకుండా తప్పించు కుం టుం దన్నారు. సదస్సులో జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, రాజేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్, రెబ్బా నరసింహులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం.ఓబులేసు, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, నాయకులు షరీఫ్, మస్తాన్, ఆంజ నేయులు, సురేంద్ర, పుల్లయ్య, సురేష్ పాల్గొన్నారు.



సదస్సులో అభివాదం తెలియజేస్తున్న నాయకులు



ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీ సమస్యలను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీ కార్యకర్తలు, యూనియన్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ కొత్తగా తెచ్చిన ఎఫ్ఆర్ఎస్ వల్ల బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ పోషణ పంపిణీకి సాంకేతిక నెలకొని ఉన్నందున వెంటనే ఆర్‌జెడి పద్మజతో, ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మితో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యామ్నాయంగా లబ్దిదారుల కుటుంబ సభ్యులకు ఫీడ్ ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయించారు. దేవపట్ల, శెట్టిపల్లెలకు చెందిన 93 మంది అంగన్వాడీలకు 2022 ఆగస్టుకు సంబంధించిన పెండింగ్ జీతాలు ఇచ్చేలా చర్యలు తీసు కుంటామని చెప్పారు. అంగన్వాడీలకు సంక్షేమపథకాలు అమలయ్యేలా మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లకుగా చేసి వేతనాలు పెంపునకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి డి భాగ్య లక్ష్మి, ఉపాధ్యక్షురాలు పి.బంగారుపాప, పి.ఖాజాబి, డి. విజయమ్మ, బి.నాగమణెమ్మ పాల్గొన్నారు.

పేదల బతుకుల్లో వెలుగులు

పీలేరు : రాష్ట్రంలో అర్హులైన పేదల బతుకుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీ, పద్మావతి నగర్, లైబ్రరీ వీధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి లబ్దిదారులను పలకరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలకు అండగా నిలుస్తోందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ లక్ష రూపాయలకు పైగా లబ్ది చేకూరు తోందని అన్నారు. జగనన్న ప్రభుత్వానికి అనుకూలంగా ప్రజలు ఉండాలని తెలియజేశారు.



నీటితొట్టిలో అబేట్ ద్రావణాన్ని పిచికారి చేస్తున్న వైద్యసిబ్బంది

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల పరిధిలోని మద్దయ్యగారిపల్లెలో దోమల నివారణకు అబేట్ ద్రావణాన్ని పిచికారి చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మద్దయ్యగారిపల్లెలో సిబ్బందితో కలిసి మురికి కాలువలు, నీరు నిలువ ఉండే గుంతలలో అబేట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణ వల్ల రోగాలను దూరం చేయవచ్చని తెలిపారు. మలేరియా, డెంగీ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వారంలో ఒకరోజు డ్రైడేగా పాటించి నీరునిల్వవుండే తొట్టెలను శుభ్రపరచుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో జ్వర పీడితుల వివరాలు ఫీవర్ కంట్రోల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పరిశ్రమల పరిశీలనకు వెళుతున్న విద్యార్థులు

చిప్పిలి చెక్‌డ్యామ్‌ను సందర్శించిన 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ విభాగంలో బి.టెక్ చదువుతున్న విద్యార్థులు పరిశ్రమల పరిశీలనలో భాగంగా మదనపల్లె సమీపంలోని చిప్పిలి చెక్ డ్యామ్ పనులను సందర్శించారు. అక్కడ పని తీరును ఏఇ వై.విజయభాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న డిఫరెన్షియల్ జియో స్పెషియల్ పొజిషనింగ్ సిస్టమ్ ద్వారా భూమి స్థాయి హెచ్చు తగ్గులను ఎలా కనుగొనాలో విద్యార్థులకు తెలిపారు. ఈ పరికరం దాదాపుగా 32 శాటిలైట్‌లతో అనుసంధానమై పనిచేస్తుందని, దీని కచ్చితమైన ఫలితాలను పొందవచ్చని విద్యార్థులకు తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ టెక్నాలజీ ఎంతో ముఖ్యమని, విద్యార్థులు వీటిని సకాలంలో వీటి గురించి తెలుసుకోవాలని అన్నారు. ఎత్తైన కట్టడాలలో జరుగుతున్న కచ్చితమైన ఫలితాలు ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు డాక్టర్ ప్రేమనాథ్ బోయిక్, అనిత, వీరేష్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటి డిఇఒ కృష్ణప్ప

విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు క్రమశిక్షణ, సేవా గుణం అలవరచుకోవాలని డిప్యూటి డిఇఒ కృష్ణప్ప పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జిఆర్‌టి హైస్కూల్‌లో భారత్ స్కౌట్స్ ఆధ్వర్యంలో చతుర్థచరణ్ ట్రైనింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప, ఎంఇఒలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, భారత్ స్కౌట్స్‌అండ్ గైడ్ జెండాను ఎగురువేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ పిల్లలకు ఇప్పటినుంచి మంచి క్రమశిక్షణ కలిగి ఉన్నత చదువులు చదివి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఐదు రోజులపాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఎఎస్ఒసి కోటేశ్వరావు, కోర్స్ ఇన్‌స్ట్రక్చర్స్, ఫణిభూషణ్, హిమగిరి, జిఆర్‌టి హెచ్ఎం పద్మారాని, క్లబ్ మాస్టర్స్ చంద్రశేఖర్, భూపతి, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



పల్లెబాట కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజలకు మరింత చేరువయ్యేందుకే పల్లెబాట

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజలకు మరింత చేరువయ్యందుకే రాష్ట్ర ప్రభుత్వం పల్లెబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వైసిపి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారనాథరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం పెద్దతిప్పసముద్రం మండలం, బూచుపల్లి పంచాయతీలో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గిరిధర్‌రెడ్డి, తహశీల్దార్ విద్యాసాగర్, ట్రాన్స్‌కో ఉత్తన్న, అగ్రికల్చర్ ప్రేమ లత, మండల నాయకులు ఎంపీపీ మహమ్మద్, జడ్‌పిటిసి ఉంగరాల శివన్న, జెసి ఎస్ మండల కన్వీనర్ డ్రిప్ రమణ, దూలం వారిపల్లి కుమార్ రెడ్డి, వ్యవసాయ బోర్డు మెంబర్, బూచుపల్లి సర్పంచ్ శ్రీరామ్‌రెడ్డి, ఎంపిటిసి ముత్తన కిట్టన్న, మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్, రామ్‌రెడ్డి కేశవరెడ్డి, గణప రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి నాగరాణి, డిజిటల్ అసిస్టెంట్లు,వెల్ఫేర్ అసిస్టెంట్, విఆర్ఒ, హౌసింగ్ ఎఇ, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి



పోలింగ్‌స్టేషన్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

లక్కిరెడ్డి పల్లి గ్రామపంచాయతీ లోని 2వ వార్డు పోలింగ్ ఉప ఎన్నికల సందర్భంగా శుక్రవారం జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చక్రినాయక్ తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఐదు గంటలకు ఫలితాలు వెలుపడతాయని ఆయన తెలిపారు. పోలింగ్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు, 36 మంది పోలీసులు 10 స్పెషల్ డిపార్ట్మెంట్ పోలీసులు అందుబాటులో ఉన్నారని తెలిపారు.ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవచ్చని తెలిపారు.

దళితులపై వివక్ష తగదు

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-కలకడ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సభ్యులు

దళితుల పట్ల వివక్ష చూపడం సరైన పద్ధతి కాదని ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రాల కలకడ తహశీల్దార్ కార్యాలయంలో ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశాన్ని తహశీల్దార్ ప్రదీప్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్ర బ్యాంక్ లో రైతులు క్రాప్‌లోన్ తీసుకొని సంవత్సరం తర్వాత క్రాప్ లోన్ రెన్యువల్ చేయాలని రైతులు బ్యాంకు కు వెళితే సదరు బ్యాంకు మేనేజర్ సిబ్బంది వడ్డీ కట్టించుకోకుండా తీసుకున్న రుణంతో సహా వడ్డీ కట్టాలని దళిత, గిరిజన రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. మండల పరిధిలో భూ పంపిణీ లో రెండు పంచాయతీల్లో 11 మందిని ఎంపిక చేయడం చాలా బాధాకర విషయమన్నారు. మండల పరిధిలోని ఎంతోమంది దళిత, గిరిజన ప్రజలు సెంటు భూమి లేక ఇబ్బందులు పడుతుంటే రెవెన్యూ అధికారులకు సెంటుభూమి లేని నిరుపేదలు కనిపించరా అని ప్రశ్నించారు. ఎంపిపి శ్రీదేవి స్పందించి మండలంలో ఎవరికైతే భూమి లేకుండా ఉంటారో వారి పేర్లు తహశీల్దార్‌కు ఇవ్వమని ప్రపోజల్ చేస్తామని హామీనిచ్చారు. ఎస్‌సి,ఎస్‌టి గ్రామాల పరిధిలో శ్మశాన వాటిక లక నిర్మించడానికి స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. మండల పరిధిలో అంబేద్కర్ విగ్రహానికి, అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, మండల పలు శాఖల ప్రభుత్వ అధికారులు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘ నాయకులు నరసింహులు, నాగయ్య, చంద్రయ్య, మల్లికార్జున చౌడప్ప ,రెడ్డయ్య పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించండి

ప్రమాదాల నుంచి కాపాడండి

ప్రజాశక్తి-పుల్లంపేట



రెడ్డిపల్లిపేట వద్ద గుంతలమయమైన రోడ్డు



బైకును ఢీకొన్న ట్రాక్టర్

మండల పరిధిలోని రెడ్డిపల్లి పేట వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయమై వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. జాతీయ రహదారి అంతా గుంతల మయంగా మారడంతో రాత్రిపూట వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డుపై గుంతలలో నీరు నిల్వడంతో వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు బురదంతా ఇళ్లలోకి వచ్చి చేరుతోందని స్థానిక ప్రజలు ఆవేదన చేస్తున్నారు. రహదారి గుంతల మయమే కాకుండా, మలుపు ప్రాంతం కావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శుక్రవారం ఉదయం ట్రాక్టర్ బైక్ ఢీకొనగా వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.గాయపడి వ్యక్తిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పలుమార్లు వాహనాలు బోల్తాపడటంతో పాటు కొన్ని అనివార్యమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని ప్రభుత్వం చెబుతుందే తప్ప రోడ్డు మరమ్మతులకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : 'కొరముట్ల'



సిమెంటు రోడ్డు నిర్మాణానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గ అభివృద్దే తమ లక్ష్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులుపేర్కొన్నారు. రైల్వే కోడూరు మండలం రాఘవరాజపురం దళితవాడలో రూ.5 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాలలో మౌళిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకవస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏపి టూరిజం డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, స్థానిక నాయకులు ఆర్.వి.రమణ, మోహన్‌రెడ్డి, చిన్నయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఫక్కీరారెడ్డి సేవలు అభినందనీయం : ఎంపిపి

ప్రజాశక్తి-గాలివీడు



పిల్లలకు కేకు తినిపిస్తున్న వేదమూర్తిరెడ్డి

మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కీ.శే.మిట్టపల్లి ఫక్కీరారెడ్డి సేవలు అభినందనీయమని వైస్ ఎంపిపి మిట్టపల్లి యధుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శతజయంతి సందర్భంగా శుక్రవారం కస్తూర్భాగాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలతో కలిసి అక్కడ కేక్‌కట్, విద్యార్థులకు మాంసహార భోజ నాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు గ్రామంలో ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. కార్యక్ర మంలో ఫక్కీరారెడ్డి మనువడు గోపాలకృష్ణారెడ్డి, సిఇఒ శ్రీనివాసులు కూరగాయల సుబ్బారెడ్డి, సూరిబాబు, గంగాధర్‌నాయుడు, ఎస్‌పి పరశు రామ్ ప్రభాకర్, విశ్వనాథ, కృష్ణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ వినోద్‌కుమార్, వాలంటీర్ రాజశేఖర్, పాఠ శాల ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

'మానవత' సేవలు ఉన్నతమైనవి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

మానవత సంస్థను ఆదరిస్తున్న మానవతామూర్తులను అభినందనీయులని మానవత సంస్థ మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గాలివీడు బస్టాండ్ ఆవరణంలో శాంతిరథం ర్యాలీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఫ్రీజర్ బాక్సులు, శాంతిరథం ఇలా త్వరలో అంబులెన్సులు కూడా ఏర్పాటు చేయడానికి మండల ప్రజలు సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. కన్వీనర్ కానాలశివారెడ్డి మాట్లాడుతూ మండలంలో మానవతామూర్తులు వారి సలహాలు సూచనల మేరకు మండలంలో మానవత సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రజలందరూ ఐక్యమత్యంగా మానవత సంస్థాను సద్విని చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పేర్కొన్నారు. బస్టాండ్ నుంచి గేటు వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దామోదరయ్య, గోరాంచెరువు ఎంపిటిసి, గాలి శ్రీనివాసులు ట్రెజరర్ చంగల్‌రాయుడు, హీరా, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

లేగ దూడల పెంపకంపై పాడి రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి



లేగదూడలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

మండలంలోని మర్రికుంటపల్లె గ్రామంలో పశు సంవర్ధక శాఖ ద్వార దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. లేగ దూడల పెంపకంలో మెళకువల గురించి రైతులకు అవగాహన కల్పించారు. నేటి లేగ దూడే రేపటి పాడి అనే నినాదంతో పెయ్య దూడల పెంపకం ప్రాముఖ్యతని రైతులకు వివరించారు. పలు గ్రామల నుంచి సుమారు 50 వరకు పెయ్య దూడలను ప్రదర్శన కొరకు రైతులు తీసుకుని వచ్చారు. వచ్చిన దూడలలో పుష్టిగా ఉన్న మూడు దూడలను ఎంపిక చేసి బహు మతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మర్రి కుంటపల్లె సర్పంచ్ రెడ్డిరాము, కలికిరి జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, ఎంపిపి నూర్జహాన్, మండల కన్వీనర్ రమేష్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు రత్న శేఖర్‌రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్ళై, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఇఒ డాక్టర్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. జడ్‌పి టిసి పద్మజ లోకవర్ధన్ మాట్లాడుతూ దూడలకు సరైన పద్ధతులలో పోషించడం వలన నేటి పెయ్య దూడే రేపటి పాడి ఆవులు అగును అని తెలియజేసారు. కార్యక్రమంలో డాక్టర్ గిరినాథ్ మాట్లాడుతూ 28 గడ్డి కత్తిరించె యంత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది , పాడి రైతులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండలంలోని పల్లవోలు గ్రామపంచాయతీ కస్పాలోని చౌడేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు దేవాలయ కార్య నిర్వహణ అధికారి పురం వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కెవిపల్లి మండలం గ్యారంపల్లి గురుకుల పాఠశాలలో పనిచేసిన విశ్రాంత ప్రిన్సిపల్ నార్నవరం వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి అభిషేకాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారి కుటుంబ సభ్యులతో సహా, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో దాదాపు 50 లక్షల రూపాయలతో దేవాలయ పునర్నిర్మాణం నిర్మించి అమ్మవారికి వెండి కిరీటంతో బహుకహకరించి దేవాలయాన్ని ప్రారంభించడం జరిగిందని, ఇందులో భాగంగానే ప్రతి శుక్రవారం అమ్మవారి కి ప్రత్యేక పూజలు జరుపుకుంటామని మా కుల దైవం ఐన అమ్మవారిని ప్రత్యేక పూజలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పరవశం అవుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోమల్ కుమార్, వారి కుటుంబ సభ్యులు మరియు , పుర్రు లక్ష్మీనారాయణ, పోస్ట్ రాజ, శేఖర సాఫ్ట్వేర్ రమేష్, వెంకటేష్ సివిల్ ఇంజినీర్, భాస్కర్, సుబ్రహ్మణ్యం, రాజు, జయచంద్ర పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** పట్టణ సమీపం లోని పోలిచెరువుగట్టుపై వెలసిన శనేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అప్పజోడు విజయస్వామి ఆధ్వర్యంలో శ్రీ నర్మదా బాణలింగం పార్వతి దేవి దేవతల ప్రతిష్టలు చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో తొమ్మిది రోజులు ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆరవ రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, సప్త సిద్ధి పారాయణం, దీక్ష హోమం, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సరసా రవికుమార్ స్వామి, బండాత్మకూరు శివకుమార్‌స్వామి, యశ్వంత్ స్వామి, దత్తాత్రేయ స్వామి, ప్రకాష్, నారాయణ శాస్త్రి పాల్గొన్నారు.



విరాళాన్ని అందిస్తున్న జయచంద్రారెడ్డి, గిరిధర్ రెడ్డి

ప్రహరీ నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని పర్తికోట గ్రామపంచాయతీలో మారెమ్మ గుడి ప్రహరీ నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, మొరుసు కాపురెడ్డి సంఘంనేత కదిరి నాథునికోట దాసిరిపల్లి జయచంద్రారెడ్డి లక్ష రూపాయలు, మంత్రి గిరిధర్‌రెడ్డి రూ.50వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా మారెమ్మ ఆలయ నిర్మాణ పనులను గ్రామ ప్రజలందరూ కలిసి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఈ ఆలయానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని గ్రామ పెద్దలు మాధవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి ,నరసింహారెడ్డి ,రాజశేఖర్ లు కలిసి పారిశ్రామిక వేత్త జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమ గ్రామంలో ఉన్న ఆలయానికి ఆహ్వానించారు. ఆయన ములకలచెరువు మండలంలోని పర్తీ కోట గ్రామానికి వెళ్ళగా గ్రామస్తులు మేళ తాళాలతో, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక ఆలోచనలు కలిగే అనేక ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధికి విరాళాలను అందిస్తున్నామన్నారు. సనాతన ధర్మాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ విశ్వాసానికి, నమ్మకానికి నెలవయినా పురాతన ప్రాశస్తం కలిగిన దేవాలయాల అభివృద్ధికి తోడ్పడుతూ వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. గ్రామ ప్రజలందరూ కోరిక మేరకు తన వంతుగా లక్ష రూపాయలు,తన బావ అయినా మంత్రి గిరిధర్ రెడ్డి రూ.50వేలు ఇస్తారని చెప్పారు. వేపూరు కోటకు చెందిన మార్కీరి ఆంజనేయ రెడ్డి రూ.1116, మాజీ ఉపసర్పంచ్ ముత్ర శ్రీరాములురెడ్డి రూ.1116లు అందించడం సంతోషకరమన్నారు కార్యక్రమంలో ఆయనతోపాటు సర్పంచ్ కేశవరెడ్డి, ఎంపిటిసి నరసింహనాయుడు, మాజీ వైస్ ఎంపిపి నరసింహారెడ్డి, మాజీ సర్పంచులు రెడ్డప్పరెడ్డి, మస్తాన్‌రెడ్డి, కేశవరెడ్డి, మల్లప్ప నాయుడు, బేరి చిన్నరెడ్డన్న, బి మల్లికార్జున రెడ్డి, రవీందర్ రెడ్డి, కె.చిన్నపరెడ్డి, అమర్నాథ రెడ్డి, బాబురాయిని రాజశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

వేరుశనగలో బెట్టనివారణపై అవగాహన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వేరుశనగలో బెట్ట నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు తప్పక పాటించాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో వేరుశనగ పంట కొంతమేర ఎండ తీవ్రతకు వాడినట్లు తెలిపారు. సకాలంలో తగినంతగా వర్షం కురవకపోవడంతో పంట ఎండ తీవ్రతకు గురవుతున్నదని అన్నారు. ఈ ప్రభావాన్ని కొంతమేర తట్టుకోవడానికి రైతులు రెండు శాతం యూరియా చొప్పున కలిపి ద్రావణాన్ని వేరుశెనగ పంటపై పిచికారి చేయాలన్నారు. ఈ విధంగా పిచికారి చేయడం వలన పంట సుమారు పది రోజులపాటు బెట్టను తట్టుకొని పంటను సంరక్షించుకోవచ్చు అన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

నేడు రామసముద్రం మండల సమావేశం

ప్రజాశక్తి-రామసముద్రం

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కుసుమ కుమారి సుందరం ఆధ్వర్యంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలం కాకుళరం గ్రామ పరిధిలోని కొత్త రాచపల్లి తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా దాదాపు అరబై కుటుంబాలు తాగడానికి నీళ్ల కోసం అవస్థలు పడుతుంటే కనీసం అధికారులు ఎవరు పట్టించుకోలేదని అప్పటికే ఉన్న చేతిపంపు బోర్లులో గంటల తరబడి కొట్టిన బిందెడు నీళ్లు రావడం లేదన్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

మల్లయ్య కొండకు ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మదనపల్లె నుంచి ప్రముఖ శైవక్షేత్రమైన తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ఈనెల 21వ ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి బస్సు ఉదయం 5 గంటలకు,రెండవ బస్సు 6.20 గంటలకు, మూడవ బస్సు 7.30 గంటలకు మదనపల్లె వన్ డిపో బస్టాండ్ నుంచి బయలుదేరుతాయన్నారు. మల్లయ్యకొండపై సహస్ర పట్టాభిషేకం, వరుణయాగం అత్యంత వైభవంగా జరుగుతాయని ఇందులో పాల్గొనే భక్తుల కోసం ఎమ్మెల్యే పెద్దిరెడ్డిద్వారకానాథ్‌రెడ్డి చొరవతో బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీశైలం తరహాలో మల్లయ్య కొండకు గుర్తింపు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



మల్లయ్య కొండపై మద్దిరెడ్డి కుటుంబ సభ్యులు

శ్రీశైలం తరహాలో మల్లయ్యకొండకు ప్రత్యేక గుర్తింపుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి కుటుంబీకుల కృషి ఎంతగానో ఉందని ఆలయ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా కనుగొండ మద్దిరెడ్డి కుటుంబ సభ్యులతో మల్లయ్య కొండను సందర్శించారు. ఆలయ పూజారులు ఈశ్వరప్ప మల్లికార్జున స్వాములు వారికి స్వాగతం పలికి స్వామివారికి పూజలో అభిషేకాలు చేశారు. పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణతో అమ్మవారికి పూజలు అభిషేకాలు నిర్వహించి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చారిత్రాత్మకమైన ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ల కృషితో ఆలయ పునర్నిర్మానం జరగడం చరిత్రలో మరపురాని ఘట్టమన్నారు. మల్లయ్య కొండకు రోడ్డు సౌకర్యం కల్పించడంతో వాహన సౌకర్యం కలిగింది సుదూర ప్రాంతాల నుంచి బస్సులు మల్లయ్య కొండకు రావడం విశేషమన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి-సుండుపల్లె



రఘునాథ్‌రెడ్డి(ఫైల్ ఫొటో)

మండలంలోని రెడ్డన్నగారిపల్లికు చెందిన అమలాపురం రఘునాథ్ రెడ్డి(55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి దేవాల యంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న రఘు నాథ్‌రెడ్డి శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహ నంలో రాజంపేటకు వెళ్లి తిరిగి సుండుపల్లె తన స్వగ్రామానికి వస్తుండగా సానేపాయి సమీ పంలోని ఘాట్‌రోడ్‌లో చెట్టుకు ఢీకొని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రఘునాథ్‌రెడ్డి మృతితో వారి కుటుంబం తోపాటు గ్రామంలో విషాదం అలుముకుంది.